ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి

(గౌరవ న్యాయమూర్తులు శ్రీ C. ప్రవీణ్ కుమార్, శ్రీ B. క్రిష్ణమోహన్ గార్ల బెంచ్)

సివిల్ మిస్లీనియస్ అప్పీల్ నెం.402/2019

తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ B.క్రిష్ణమోహన్ గారు,

తేది:25-02-2021

**గందిబోయిన కనకదుర్గ** **... అప్పీలుదారు**

**V/S**

**గందిబోయిన నారాయణ రావు** **... రెస్పాండెంట్**

* * *

**1.** పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులోని HMOP NO.214/2017 వ పిటిషన్ లో 08-07-2019 వ తేదిన న్యాయమూర్తి గారు ఇచ్చిన ఆర్డర్ కు వ్యతిరేకంగా ఈ సివిల్ మిస్లీనియస్ అప్పీల్ దాఖలు చేయడమైనది. ఆ పిటిషన్ లో విడాకుల డిక్రీని మెంజూరు చేయడం మరియు శాశ్వత భరణం ఉపశమనాన్ని రద్దు చేసినందుకు ఈ అప్పీలు దాఖలు చేయడమైనది.

**2.** ఈ అప్పీలులో అప్పీలుదారు ట్రయల్ కోర్టు లో పిటిషనర్ గాను మరియు రెస్పాండెంట్ రెస్పాండెంట్ గాను ఉన్నారు.

**3.** ఈ అప్పీలులో అప్పీలుదారు న్యాయవాది, రెస్పాండెంట్ న్యాయవాది వారి వాదనలను కోర్టులో వినిపించారు.

**4.** ఈ అప్పీలులో అప్పీలుదారు భార్యగాను మరియు రెస్పాండెంట్ భర్తగాను ఉన్నారు. అప్పీలుదారు/పిటిషనర్ ఏలూరు ప్రిన్సిపల్ సినియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో H.M.O.P నెం.214/2017 ను హిందు వివాహ చట్టం 1955, సెక్షన్ 13 (1) (IA) ప్రకారం పిటిషనర్ పట్ల క్రూరత్వం మరియు ఆమెను వదలివేసారని(Desertion) కారణాలతో రెస్పాండెంట్ పై వివాహాన్ని రద్దు చేయడం ద్వారా విడాకులు మర్తయు శాశ్వత భరణం కొరకు దాఖలు చేయడమైనది.

5. ట్రయల్ కోర్టులో పిటిషనర్ అయిన భార్య ఈ విధంగా తెలియచేసినది. పిటిషనర్ కు, రెస్పాండెంట్ కు 12-05-1974 వ తేదిన బొర్రపాలెం గ్రామంలో హిందు ఆచారం మరియు సాంప్రదాయం ప్రకారం వివాహం జరిగినదని ఆ తరువాత వారికి ఇద్దరు కుమార్తెలు పుట్టినారని, వారికి కూడా వివాహాలు చేసినారని అంతకుముందు నుండే రెస్పాండెంట్ అయిన భర్త బొమ్మిడి గంగమ్మతో 1985 వ సం.నుండి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, ఈ అంశాన్ని పిటిషనర్ అయిన భార్య గ్రామ పెద్దలకు చెప్పగా గ్రామ పెద్దలు మధ్యస్తం చేసి పిటిషనర్/భార్యకు య.0.36 సెంట్ల భూమిని చెందచేయగా ఆ భూమిని కూడా ఇద్దర కుమార్తెల వివాహ సమయంలో పసుపు-కుంకుమ క్రింద వారికి చెందచేసినదని ఆ తరువాత పిటిషనర్ ఒంటరిగా మిగిలిపోయినదని ఆ తరువాత ఆమె తమ్ముడు సూర్యనారాయణ అండతో జీవిస్తున్నదని మరియు రెస్పాండెంట్ అకారణంగా పిటిషనర్ ను వదలివేసినందున మరియు వారిద్దరు కలిసి జీవించేందుకు అవకాశం లేనందున మరియు పిటిషనర్ నిరక్షరాస్యురాలు అయినందున ఆమె జీవనానికి ఎలాంటి ఆర్థిక వసతులు లేనందున ఆమెకు శాశ్వత భరణం రూ.10,00,000/- యలు చెల్లించాలని 24-04-2017 వ తేదిన రెస్పాండెంట్ లీగల్ నోటీసు ఇవ్వగా దానికి రెస్పాండెంట్ ఎలాంటి సమాధానం ఇవ్వనందున పిటిషనర్ విడాకులు మరియు శాశ్వత భరణం కొరకు పై నెంబర్ HMOP దాఖలు చేయడమైనది.

6. పిటిషనర్ చేసిన ఆరోపణలను రెస్పాండెంట్తిరస్కరిస్తూ కౌంటర్ దాఖలు చేశారు, ఆ కౌంటర్ లో రెస్పాండెంట్ఈ విషయాల్ను తెలియచేసినారు. పిటిషనర్ మరియు ఆమె ఇద్దరు కుమార్తెలు

రెస్పాండెంట్ పై క్రూరంగా ప్రవర్తించినారని మరియు ఆస్తులు అన్నీ ఇవ్వాలని ఒత్తిడి చేశారు అని దానికి సంబంధించిన వారు రెస్పాండెంట్ కు వ్యతిరేకంగా అనేక సివిల్ దావాలు దాఖలు చేశారు అని, బొర్రంపాలెం గ్రామం వద్ద ఉన్న అతని ఆస్తులు కోర్టులలో పెండింగ్ లో ఉన్నందున మరియు రెస్పాండెంట్ పిటిషనర్ ను ఏనాడు నిర్లక్ష్యం చేయలేదని కాబట్టి శాశ్వత భరణం ఆమె కోరిన మేరకు చెల్లించే ప్రశ్న చట్టప్రకారం రాదని కావున పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్ రద్దు చేయవలసినదిగా రెస్పాండెంట్ కోరినాడు.

7. పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్ ను, రెస్పాండెంట్ దాఖలు చేసిన కౌంటర్ ను ట్రయల్ కోర్టు న్యాయమూర్తి గారు పరిశీలించి వాదాంశములను ఈ క్రింది విధంగా నమోదు చేసినారు.

A. "విడాకుల డిక్రీ మంజూరు చేయడానికి మరియు శాశ్వత భరణం మంజూరు చేయడానికి పిటిషనర్ అర్హత కలిగి ఉన్నారా?

8. విచారణ సమయంలో, పిటిషనర్ తరపున PW.1 మరియు PW.2 ను విచారించి Ex.P1 నుండి EX.P9 పత్రాలను (Documents) మార్క్ చేయబడ్డాయి. రెస్పాండెంట్ / ప్రతివాది తరపున RW1 విచారించినారు మరియు RW1 తరపున ఎలాంటి పత్రాలు మార్క్ కాలేదు.

9. PW1 పిటిషనర్, మరియు PW2 పిటిషనర్ యొక్క స్వతంత్ర సాక్షి RW1 అంటే రెస్పాండెంట్.

| | |
|---|---|
| EX.P1 | పిటిషనర్, రెస్పాండెంట్ ల పెళ్లి పత్రిక |
| EX.P2 | 24-04-2017 వ తేదిన రెస్పాండెంట్ కు పంపిన లీగల్ నోటీసు ఆఫీసు కాపీ |
| EX.P3 | పిటిషనర్ ఆధార్ కార్డు |
| EX.P4 | రెస్పాండెంట్ మరియు అతని అన్నదమ్ముల మధ్య 22-10-1989 వ |

| | |
|---|---|
| | తేదిన వ్రాసుకున్న భాగపరిష్కార పత్రము |
| EX.P5 | య.0-16 సెంట్ల మేరకు అడంగల్ పహాణి, తేది 04.01.2019 |
| EX.P6 | య.0-05 సెంట్ల మేరకు అడంగల్ పహాణి, తేదీ 31.12.2018 |
| EX.P7 | య.0-04 సెంట్ల అడంగల్ పహాణి, తేది 31.12.2018 నాటి |
| EX.P8 | 1B అడంగల్ కాపీ |
| EX.P9 | య.1-15 సెంట్లు, అడంగల్ పహాణి, తేది. 31.01.2019 |

10. రికార్డులో ఉన్న సాక్ష్యాధారాల ఆధారంగా రెస్పాండెంట్ పిటిషనర్ ను ఉద్దేశపూర్వకంగా, బుద్ధిపూర్వకంగా నిర్లక్ష్యం చేసి, ఎటువంటి న్యాయమైన కారణం లేకుండా(అకారణంగా) ఆమెను విడిచిపెట్టాడు అని, మరియు భవిష్యత్తులో కలిసి కాపురం చేసే అవకాశం లేదని కావున వారిద్దరి వివాహాన్ని రద్దు చేయడం ద్వారా వారికి విడాకుల డిక్రీ మంజూరు చేయడానికి ట్రయల్ కోర్టు నిర్ధారించింది. కానీ శాశ్వత భరణం మంజూరు విషయంలో ట్రయల్ కోర్టులో రెస్పాండెంట్ ఆదాయాన్ని పిటిషనర్ రుజువు చేయనందున మరియు అతని ఆస్తులు ద్వారా ఎంత మేర ఆదాయం వస్తున్నది అనే విషయం రుజువు చేయనందున పిటిషనర్ కు శాశ్వత భరణాన్ని కోరటానికి అర్హత లేదు అని భావించి శాశ్వత భరణాన్ని పిటిషనర్ కు మంజూరు చేయలేదు. కానీ పిటిషనర్ ప్రత్యేక పిటిషన్ ద్వారా సివిల్ దావా దాఖలు చేసి రెస్పాండెంట్ /భర్తపై మనోవర్తి పొందేందుకు న్యాయపరమైన అడ్డంకి లేదని ట్రయల్ కోర్టు 08-07-2019 వ తేదిన డిక్రీని మంజూరు చేస్తు పిటిషనర్ మరియు రెస్పాండెంట్ వివాహాన్ని రద్దు చేయడం ద్వారా విడాకులు మంజూరు చేస్తు శాశ్వత భరణం మంజూరు ను తోసిపుచ్చినది.

11. పిటిషనర్ ఈ డిక్రీ ప్రకారం శాశ్వత భరణం రానందున ఈ సివిల్ మిసిలేనియస్ అప్పీల్ నెం.402/2019 ను గౌరవ హైకోర్టులో దాఖలు చేసినారు.

12. అప్పీలుదారు తరపు న్యాయవాది తన వాదనలో ట్రయల్ కోర్టు శాశ్వత భరణాన్ని మంజూరు చేయడంలో ఘోరంగా విఫలమైందని, అప్పీలుదారు తరఫు న్యాయవాది వాదించారు. అంతేకాక రెస్పాండెంట్ /ప్రతివాదికి తగినంత భూమి ఆస్తి ఉన్నదని, మరియు తగినంత ఆదాయం మార్గాలు ఉన్నాయని చూపినప్పటికీ పిటిషనర్ / భార్యకు విడాకులు, క్రురత్వం మరియు వదిలివెయ్యటం కారణాలతో మంజూరు చేస్తూ శాశ్వత భరణం మంజూరు చేయకపోవడం చట్టసమ్మతం కాదని వాదించినారు.

13. వీడాకులు తీసుకున్న భార్యకు భరణం మంజూరు చేయకుండా ట్రయల్ కోర్టు తప్పు చేసింది, భర్త విడాకుల తర్వాత కూడ చట్ట ప్రకారం భరణం ఇవ్వాల్సిన బాధ్యత వుంది. రెస్పాండెంట్/ప్రతివాదికి ఉన్న భూమి పై ఆదాయం ఎంతో పిటిషనర్/భార్య నీరుపించకపోవటం వల్ల భరణం మంజూరు చేయకపోవడం సమంజసం అని, రెస్పాండెంట్ తరపు న్యాయవాది వాదించారు.

14. ట్రయల్ కోర్టు యొక్క తీర్పు మరియు రికార్డులలో అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత భార్యను/అప్పీలుదారును వదలివేయడానికి ముందు మరియు తరువాత కూడా రెస్పాండెంట్, పిటిషనర్ మరియు ఆమె ఇద్దరు కుమార్తెలను సక్రమంగా చూసినట్లు మరియు పెద్దల జోక్యంతో కుమార్తెల వివాహాలు చేయడమే కాకుండా అతనికి ఉన్న భూమిలో కొంత భాగాన్ని వారి 'పసుపు కుంకుమ'గా అతను ఇచ్చినాడని, మరియు కొన్ని ప్రత్యేక సందర్భాలలో పిటిషనర్ మరియు వారి కుమార్తెలు రెస్పాండెంట్ పై క్రూరత్వానికి పాల్పడ్డారని మరియు అతని ఆస్తులను లాక్కొని అతనిపై కొన్ని సివిల్ దావాలు వేశారని కావున అతనికి తగినంత ఆస్తులు ఉన్నట్లు నిరూపణ అయినదని కావున తనను మరియు ఇతర కుటుంబ సభ్యులను కూడా పోషించడానికి ఆర్థిక స్తోమత ఉన్నట్లు నిరూపణ అయినదని మరియు భర్తగా భార్యను ఆమె జీవిత కాలంలో విడాకుల డిక్రీ మంజూరు చేసిన తరువాత కూడా ఆర్థికంగా ఆదుకోవాలి, మరియు ఆమె అటువంటి క్లెయిమ్ చేయడానికి చట్ట ప్రకారం ఏదైన అనర్హతలు

ఉంటే తప్ప శాశ్వత భరణం మంజూరు చేయవచ్చు అని కానీ, ట్రయల్ కోర్టు దానిని పరిశీలించలేదని ఆ మేరకు పొరపాటు చేసింది అని కావున శాశ్వత భరణాన్ని మంజూరు చేయకపోయినా కొంతమేర మనోవర్తి భార్యకు భర్త అయిన రెస్పాండెంట్ ఇచ్చే స్తోమత ఉన్నట్లు నిరూపణ అయినదని, కావున కొంత సహేతుకమైన మొత్తం భార్యకు ఆమె సామాజిక మరియు ఆర్థిక స్థితి మరియు జీవన ప్రమాణం కొరకు ట్రయల్ కోర్టు ఎటువంటి మొత్తాన్ని శాశ్వత భరణంగా మంజూరు చేయలేదు, కావున 08.07.2019 నాటి ట్రయల్ కోర్టు ఆదేశాలను ఈ మేరకు పక్కన పెట్టాలని మరియు న్యాయ ప్రయోజనాల దృష్ట్యా ఇక్కడ పిటిషనర్/భార్య/అప్పీలెంట్ కు భరణాన్ని నిరాకరించడం సమంజసం కాదని ఉన్నత న్యాయస్థాన బెంచ్ న్యాయమూర్తులు భావించినారు.

15. దీని ప్రకారం ఈ సివిల్ మిస్లినీయస్ అప్పీల్ పాక్షికంగా అనుమతించబడుతుందని మరియు పైన పేర్కొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరియు ప్రస్తుతం ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్న దృష్ట్యా ధరలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ న్యాయస్థానం పిటిషనర్ నిర్వహణ కోసం నెలకు రూ.10,000/-యలు మంజూరు చేయడానికి సహేతుకమైన మొత్తం అని ఈ పైకాన్ని రెస్పాండెంట్ నెలకు రూ.10,000/-(పది వేలు మాత్రమే) శాశ్వత భరణం కోసం చెల్లించాలని మరియు ఐదేళ్ళకు ఒకసారి, ఆమె దిగువ కోర్టులో తగిన దరఖాస్తును దాఖలు చేయడం ద్వారా పేర్కొన్న రూ.10,000/- యల్ మొత్తాన్ని పెంచ్చుకునే స్వేచ్ఛవుంది. పిటిషనర్ పైన పేర్కొన్న నెలవారీ నిర్వహణ మొత్తానికి అర్హులుగా ప్రకటించారు. పిటిషన్ దాఖలు చేసిన తేది నుండి తీర్పు ఇచ్చిన తేది వరకు ఉన్న బకాయిలను కూడా ఆమెకు చెల్లించాలి అని మరియు ఆమెకు ఈ రోజు నుండి 3 నెలల్లోపు ఆ బకాయిలను చెల్లించాలని మరియు 01..03.2021 వ తేది నుండి ప్రతి నెల మొదటి వారంలో పిటిషనర్ కు రూ.10,000/- యలు క్రమం తప్పకుండా చెల్లించాలని న్యాయస్థానం బెంచ్ తీర్పు ఇచ్చినది.

16. దీని ప్రకారం మిగిలిన సివిల్ అప్పీల్ ఎటువంటి ఖర్చులు లేకుండా పాక్షికంగా అనుమతించబడింది. దీనికి కొనసాగింపుగా CMAలో ఏవైనా పెండింగ్ యితర పిటిషన్లు ఉన్నట్లయితే అవి కూడా రద్దు చేయబడతాయి.

______________________________ జస్టిస్ యు. దుర్గా ప్రసాద్ రావు

______________________________ జస్టిస్ బి. కృష్ణ మోహన్

తేదీ: 25-02-2021.